నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, బుధవారం 14 మే 2025 | SANGAREDDY


## జొన్నల కొనుగోళ్లలో అక్రమాలు



మనూరులో జొన్నల కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

- ఇష్టారీతిగా మనూరు జొన్నల కొనుగోలు కేంద్రం అధికారులు
- జిల్లా అధికారులు విచారణ చేపట్టాలి
- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మనూరు, మే 13: అధికారులు ఇష్టారాజ్యంగా జొన్నలు కొనుగోలు చేస్తూ రైతులకు నష్టం చేస్తున్నారని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మనూరు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. మనూరు జొన్నల కొనుగోలు కేంద్రంలో అధికారులు వారికి నచ్చిన రీతిలో కొనుగోలు చేస్తున్నారని రైతులు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు కుమ్మక్కై రైతులను దోపిడీకి గురిచేస్తున్నారని ఆరోపించారు. క్వింటాలుకు 5 నుంచి 6కిలోల చొప్పున కడ్తా తీసుకుంటు, డబ్బులు ఇస్తేనే కాంటా చేస్తామని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రైతుల జొన్నలు కొనుగోలు చేయకుండా పక్కరాష్ట్రం నుంచి వచ్చిన జొన్నలకు డబ్బులు తీసుకుని కాంటా చేస్తున్నారని అన్నారు. పక్క రాష్ట్ర రైతుల కోసం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్టుగా అధికారుల తీరు ఉందని విమర్శించారు. మనూరు మండల కేంద్రంలో ఇప్పటి వరకు రూ.13 లక్షల అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కొనుగోలు కేంద్రంలో అక్రమాలపై విలేకరులు వార్తలు రాస్తే, వారు డబ్బులు అడుగుతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోవడం భూపాల్‌రెడ్డి ప్రశ్నించారు. ఆర్డీవో కొనుగోలు కేంద్రానికి వచ్చి బస్తా కాంటా వేస్తే 53 కిలోలు వచ్చిందన్నారు. జిల్లా అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విఠల్‌రావు పాటిల్, మాజీ ఎంపీటీసీ ముజామ్మిల్, నాయకులు నాగేందర్ పాటిల్, మన్నన్ రైతులు ఉన్నారు.

## శాంతినగర్ తండాకు నీళ్లొచ్చినయి

నారాయణఖేడ్, మే 13: ఈనెల 13న మంగళవారం 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో 'తల్లడిల్లుతున్న తండాలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం శాంతినగర్ తండాలో తలెత్తిన నీటి సమస్య, విద్యుత్ సమస్యపై 'నమస్తే తెలంగాణ' దినపత్రిక సవివరమైన కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో మహేశ్వర్‌రావు సహా ఆయా శాఖల అధికారులు తండాను సందర్శించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడమే కాకుండా నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. తండాలోని కుంటుపడిన బోరుమోటారును సైతం పునరుద్ధరించి బుధవారం నుంచి బోరుమోటారును వినియోగంలోకి తెచ్చి తండాలో నీటి సమస్య పునరావృతం కాకుండా చూస్తామని ఎంపీడీవో తెలిపారు.

# ఆశయం ఘనం.. ఆదరణ శూన్యం

### దుబ్బాకలో ఆచరణకు నోచుకోని ఎఫ్‌ఎస్‌టీపీ (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)



దుబ్బాకలో ఎఫ్‌ఎస్‌టీపీ ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కేంద్రం



కేంద్రంలో ఏర్పాటు చేసిన శుద్ధీకరణ యంత్రాలు

- రూ.73 లక్షలతో నిర్మాణం
- ఐదు నెలల కిందట ఆర్భాటంగా ప్రారంభించిన ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ
- ఆశించిన స్థాయిలో సెప్టిక్ ట్యాంక్ వాహనాలు రాని పరిస్థితి
- అలంకారప్రాయంగా ఘన వ్యర్థాల కేంద్రం
- ప్రజలకు అవగాహన కల్పిస్తామంటున్న అధికారులు

దుబ్బాక, మే 13: పర్యావరణ పరిరక్షణతో పాటు మన ఆరోగ్యం-మన చేతుల్లోనే .. అనే నినాదంతో దుబ్బాక శివారులో ఎఫ్‌ఎస్‌టీపీ (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. లక్షలు వెచ్చించి నిర్మించిన ప్లాంట్‌కు ఆదరణ లేకుండాపోయింది. ఐదు నెలల కిందట ఎఫ్‌ఎస్‌టీపీ ప్లాంట్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ఆర్భాటంగా ప్రారంభించారు. ఆశించిన రీతిలో సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ వాహనాలు రావడం లేదు. దీంతో మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కోసం నిర్మించిన కేంద్రం ఆదరణకు నోచుకోక వెలవెలబోతుంది.

### రూ.73 లక్షలతో నిర్మాణం

బీఆర్‌ఎస్ హయాంలో పట్టణాలు, పల్లెల పచ్చదనం, అభివృద్ధిలో పరుగులు పెట్టాయి. తెలంగాణ తొలి సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రవేశ పెట్టిన పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలు అభివృద్ధి మార్గాలుగా నిలిచాయి. స్వచ్ఛత పెంపొందించేందుకు పట్టణాల్లో ఎఫ్‌ఎస్‌టీపీల ఏర్పాటుకు ప్రోత్సహించింది. మానవ ఘన వ్యర్థాలను ఎరువుగా మార్చి పంటలకు వినియోగించడం ఎఫ్‌ఎస్‌టీపీ ముఖ్య ఉద్దేశం. దుబ్బాక శివారులో దుబ్బాక-హబ్షీపూర్ రోడ్డు సమీపంలో ఎఫ్‌ఎస్‌టీపీని నిర్మించారు. పట్టణ ప్రగతి నిధులు రూ.73 లక్షలతో ఎకరా స్థలంలో మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని (ఎఫ్‌ఎస్‌టీపీ)నిర్మించారు. దుబ్బాక మున్సిపాలిటీతో పాటు పక్క గ్రామాలకు చెందిన సెప్టిక్ ట్యాంకుల్లో సేకరించిన వ్యర్థాలను ఇక్కడ డంప్ చేసే అవకాశం ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్వాహకుల నిర్లక్ష్యంతో ఎఫ్‌ఎస్‌టీపీ వినియోగానికి నోచుకోలేకపోతున్నది. ఐదు నెలల్లో సెప్టిక్ ట్యాంకర్ల నిర్వాహకులతో మున్సిపల్ అధికారులు ఎలాంటి సమావేశం ఏర్పాటు చేయలేదు. మరోపక్క మానవ ఘన వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా రవాణా చేస్తూ.. శివారు ప్రాంతాల్లో చెరువు, కుంటల్లో వదిలేయడంతో దుర్గంధంతో పాటు పలు అనారోగ్యకర సమస్యలు నెలకొంటున్నాయి. పర్యావరణం కలుషితం కావడంతో జీవరాశులకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.



మానవ ఘనవ్యర్థాలతో తయారైన ఎరువు

### అవగాహన కల్పిస్తాం..



ఎఫ్‌ఎస్‌టీపీ కేంద్రం వినియోగంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తాం. దుబ్బాక పట్టణంతో పాటు మున్సిపల్ పరిధిలోని ప్రధాన ప్రాంతాల్లో గోడలపై కేంద్రం ప్రాముఖ్యత, వినియోగం టోల్‌ఫ్రీ నంబర్ 14420 తెలిపే చిత్రాలను ఏర్పాటు చేసి మరింత ప్రచారం చేస్తాం. సెప్టిక్ క్లీనింగ్ వాహనాలు ఇక్కడికి వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– ఎం.శ్రీనివాస్‌రెడ్డి, దుబ్బాక మున్సిపల్ కమిషనర్

### ఆరు రకాల యంత్రాలు

దుబ్బాకలో మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్లాంట్‌లో నాలుగు గదుల నిర్మాణంతో పాటు ఘన వ్యర్థాల శుద్ధీకరణకు సంబంధించిన ఆరు రకాల యంత్రాలు బిగించారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్, క్లారిఫైయర్, ఎయిర్ బ్లోయర్, థర్మల్ ప్రాసెసింగ్ మీటర్లు, కన్వేయర్ మోటర్లు, స్లడ్జ్ స్క్రూ కన్వేయర్ యంత్రాలు ఏర్పాటు చేశారు. నీటి వ్యర్థాల నిల్వకు మూతలతో కూడిన సంపులను నిర్మించారు. రోజుకు 10వేల లీటర్ల ఘన వ్యర్థాలను శుద్ధి చేసే సామర్థ్యం ఉంది. ఐదు నెలల్లో 2 వేల లీటర్ల వ్యర్థాలు శుద్ధి చేయలేకపోవడం గమనార్హం. లక్షలు వెచ్చించి నిర్మించిన ఎఫ్‌ఎస్‌టీపీ అలంకారంగా మారడంతో పలు విమర్శలకు దారితీస్తుంది.



సీతారాంకుంటలో రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

## రూ.27 కోట్లతో రోడ్లకు మరమ్మతులు

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ

కొండాపూర్, మే 13: గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం సంగారెడ్డి జిల్లాకు రూ. 27.65 కోట్ల నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండాపూర్ మండలం మల్లేపల్లి నుంచి చర్ల గోపులారం చెరువు కట్ట వెడల్పుతో పాటు తేర్పోల్, హరిదాస్‌పూర్ వరకు సుమారు 7 కిలోమీటర్ల మేరకు రోడ్డును డబుల్ లేన్‌గా మార్చడానికి రూ.15 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ పనులు త్వరలోనే చేపడుతామన్నారు. కొండాపూర్ నుంచి అలియాబాద్, గారాకుర్తి గ్రామాల నుంచి సదాశివపేట వరకు సుమారు 9 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ. 10 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇక్కడి నుంచి మారేపల్లి పీడబ్ల్యూడీ రోడ్డు, అటునుంచి రాంపూర్ తండా, గోటీలగుట్ట తండా, మాచపల్లి, సీతారాంకుంట వరకు 3.8కిలోమీటర్లు రోడ్డు మరమ్మతులకు రూ. 5.20 కోట్లతో శంకుస్థాపన చేసినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్, డిప్యూటీ తహసీల్దార్ మధ్రి ప్రదీప్, ఆర్‌అండ్‌బీ శాఖ, పీడబ్ల్యూడీ శాఖ అధికారులు, నాయకులు వై.ప్రభు, కుమార్, నర్సింహారెడ్డి, మాణిక్‌రెడ్డి, నర్సింహులు, ప్రభుదాస్, కిషన్ నాయక్, జగదీశ్వర్, అశోక్, సీహెచ్ నర్సింహులు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

## నాడు జలకళ.. నేడు వెలవెల



ధూళిమిట్ట చెక్‌డ్యామ్



బీఆర్‌ఎస్ హయాంలో నాడు మండుటెండల్లోనూ తపాస్‌పల్లి రిజర్వాయర్ జలాలు విడుదల చేయడంతో ధూళిమిట్ట చెక్‌డ్యామ్ నిండుకుండను తలపిస్తూ జలసిరితో ఉట్టిపడింది. నాడు చెక్‌డ్యామ్ సాగుకు భరోసా కల్పించింది. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను ఎండబెట్టింది. ఈ రిజర్వాయర్ నుంచి నీళ్ల విడుదల చేయకపోవడంతో కాలువలతో పాటు ధూళిమిట్ట చెక్‌డ్యామ్‌లో నీళ్ల లేక ఎండిపోయి దర్శనమిస్తున్నది. – నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట జిల్లా, మే 13



## పైలట్ గ్రామాలకేనా ఆత్మీయ భరోసా

- ఏడాదికి రెండు విడతలు అమలయ్యేనా..
- మొదటి విడత రూ.6వేలు పూర్తి స్థాయిలో అందలేదు
- ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్న ఉపాధి కూలీలు
- మెదక్ జిల్లాలో 11వేల మంది అర్హులు

మెదక్, మే 13(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలమవుతున్నది. ఆత్మీయ భరోసా పథకం పైలట్ గ్రామాలకే పరిమితమైంది. అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తయినా పథకం పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. దీంతో అర్హులైన ఉపాధి కూలీలు ఆర్థిక సాయం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వసలు నివారించడం, స్థానికంగా ఉపాధి కల్పించడానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకంలో పనిచేస్తున్న భూమిలేని నిరుపేద కూలీలకు ప్రతి సంవత్సరం రూ.12వేల ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హామీ అమలు కోసం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట నూతన పథకానికి శ్రీకారం చుట్టారు. ఉపాధి హామీ సిబ్బంది అర్హుల గుర్తింపు ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశారు. ఉపాధి హామీ సిబ్బంది అర్హుల నుంచి పూర్తి వివరాలు సేకరించారు. సంవత్సరానికి రెండు విడతలుగా రూ.12 వేల ఆర్థిక సాయాన్ని మహిళల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు. మొదటి విడతలో మెదక్ జిల్లాలో 856 మందికి ఆత్మీయ భరోసా అందించారు. రెండో విడత కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

### ఆత్మీయ భరోసా పైలట్ గ్రామాలకేనా?

2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం ఉపాధి హామీ పథకంలో 20 పనిదినాలు పూర్తి చేసిన కుటుంబంలో యజమానిగా ఎవరున్నా, ఆ కుటుంబంలోని మహిళలనే లబ్ధిదారునిగా గుర్తించారు. ఆత్మీయ భరోసా పథకం అమలు కోసం రేషన్ కార్డును యూనిట్‌గా తీసుకొని అర్హులను ఎంపిక చేశారు. మెదక్ జిల్లాలోని 469 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 1.62 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. 3.32 లక్షల మంది కూలీలు పని చేస్తున్నారు. సర్వే అనంతరం ఉపాధి హామీ సిబ్బంది 11వేల మంది అర్హులుగా గుర్తించారు. జనవరి 26న మొదటి విడతకు సంబంధించిన రూ.6 వేల నగదును ప్రభుత్వం జమ చేస్తామని ప్రకటన చేసింది. కానీ, మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసింది. మెదక్ జిల్లాలో 20 మండలాల్లో పైలట్ గ్రామాల్లో మాత్రమే లబ్ధిదారులకు ఆత్మీయ భరోసా నగదు జమచేసింది. మిగిలిన వారికి మార్చి 31 వరకు నగదు జమ చేస్తామని చెప్పినా నేటి వరకు డబ్బులు జమ కాలేదు. దీంతో ఉపాధి కూలీలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై పెదవి విరుస్తున్నారు.

# సిబిల్ స్కోరుతో చిక్కే!

### రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు సిబిల్ స్కోరు తప్పనిసరి

- దరఖాస్తులపై నీళ్లు చల్లబోతున్న బ్యాంకర్లు
- దమ్మిడి ఆదాయం లేదు.. సిబిల్ స్కోరు ఎక్కడిది..?
- వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు రుణం రాదు
- షాపింగ్ లోన్లు ఉన్నా రుణాలివ్వరు
- గతంలో కార్పొరేషన్ లోన్లు నేరుగా వచ్చేవి
- పటాన్‌చెరు మండలంలో 750 దరఖాస్తులు

పటాన్‌చెరు రూరల్/కొండాపూర్, మే 13 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకం ఆశావహ నిరుద్యోగులకు అందేలా లేదు. రూపాయి ఆదాయం లేకనే ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. దమ్మిడి ఆదాయం లేని యువకులకు బ్యాంకుల్లో అకౌంట్లు ఎక్కడివి.? ఉన్నా అవి పైచదువుల కోసం సర్కార్ ఇచ్చే స్కాలర్‌షిప్‌ల కోసం తెరిచినవి. వాటిలో పెద్దగా లావాదేవీలు ఉండవు. ప్రభుత్వం ఇచ్చే కార్పొరేషన్ రుణాలకోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు, చిరువ్యాపారులకు ఇప్పుడు బ్యాంకర్ల సిబిల్ స్కోరు తనిఖీ పెద్ద ఆటంకంగా మారుతున్నది. గతంలో అన్ని కార్పొరేషన్ లోన్లను ఎంపికైన వారికి తేలిగ్గా రుణాలు ఇచ్చేవారు. ఇప్పుడు సిబిల్ స్కోరు బావుంటేనే లోన్లు లభిస్తున్నాయి. బ్యాంకరు పెట్టిన ఈ నిబంధన అధికశాతం మంది దరఖాస్తులకు ప్రతిబంధకంగా మారుతున్నది. రాజీవ్ యువ వికాసం పేరున అన్ని కార్పొరేషన్లు సబ్సిడీ రుణాల దరఖాస్తులను ఆహ్వానించాయి. పటాన్‌చెరు మండలంలో ఏదైనా స్వయం ఉపాధి కల్పించుకోవాలనే ఆశ ఉన్న నిరుద్యోగులు 750మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నో ఆశలతో సబ్సిడీ రుణాలు పొంది జీవితంలో సెటిల్ అవుదాం అనుకుంటున్న నిరుద్యోగుల ఆశలపై సిబిల్ స్కోరు నీళ్లు చల్లుతున్నది. కొందరు చిరువ్యాపారులు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు కార్పొరేషన్ లోన్లకు దరఖాస్తు చేసుకున్నారు. వారికి బ్యాంకుల్లో పెద్దగా లావాదేవీలు ఉండవు. వీరి సిబిల్ స్కోరు నామమాత్రంగానే ఉంటుంది. ఇక వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు ప్రభుత్వం అందజేసే రుణ మాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. కార్పొరేషన్ల ద్వారా వస్తున్న రుణాలకోసం ఆశపడితే అంతే సంగతులు. వారి సిబిల్ స్కోరు బ్యాడ్‌లో ఉంటుంది. వ్యవసాయం వదిలేసి ఏదైనా చిరువ్యాపారం కానీ, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు తయారు చేద్దామన్నా రుణం అందదు.

### 720 సిబిల్ స్కోరు దాటితేనే గుడ్..


బ్యాంకర్లు గుడ్, బ్యాడ్, ఎక్సలెంట్, యావరేజ్ అంటూ సిబిల్ స్కోరు నిర్ణయిస్తున్నాయి. ఆధార్‌కార్డు నెంబర్, బ్యాంక్ అకౌంట్లు, ఫోన్ నెంబర్లు కేవైసీ చేసి వాటి ద్వారా నిరుద్యోగులు, రైతులు, చిరు వ్యాపారులు సిబిల్ స్కోరు ర్యాంకులను నిర్ణయిస్తారు. క్రెడిట్ కార్డు వాడేవారికి, పెద్ద వ్యాపారులకు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు సిబిల్ స్కోరుపై పూర్తిస్థాయి అవగాహన ఉంటుంది. సిబిల్ స్కోరు పడిపోకుండా వారు డబ్బులను రొటేషన్ చేస్తారు. కొత్తగా బ్యాంక్ అకౌంట్ తెరిచిన వారికి మైనస్ 1 ర్యాంకింగ్ ఇచ్చి చిన్నపాటి రుణం మాత్రం ఇస్తారు. ఫోన్ యాప్స్‌లో లోన్లు తీసుకున్నవారికి, క్రెడిట్‌కార్డు లోన్లు ఉన్నవారికి, డీఫాల్ట్ ఉన్నవారికి సిబిల్ స్కోరు తక్కువగానే ఉంటుంది. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసిన వారికి ఆదాయం ఉండదు. ఆ ఆదాయ మార్గాలు, ఉపాధి మెరుగు పర్చుకునేందుకే కార్పొరేషన్ లోన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. పటాన్‌చెరు మండలంలో అన్ని కార్పొరేషన్లకు కలిపి 750దరఖాస్తులు వచ్చాయి. బీసీ కార్పొరేషన్‌కు 424, ఈబీసీలు 103, మైనార్టీలు 55, ఎస్సీలు 209, ఎస్టీలు 14 దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో అధిక శాతం దరఖాస్తులు సిబిల్ స్కోరు కారణంగా రుణం రాకుండాపోవచ్చు.

### సిబిల్ స్కోరుతో లింక్ పెట్టొద్దు



రాజీవ్ యువ వికాసం పథకానికి బ్యాంక్ సిబిల్ స్కోరుతో ముడి పెట్టవద్దు. ఆ విధంగా చేస్తే అసలైన నిరుపేదలకు అన్యాయం జరుగుతుంది. ఇప్పటికే బ్యాంక్ బాధితులుగా మారిన ఎంతో మంది పేదలు గతంలో తీసుకున్న లోన్లు, వాటికి సంబంధించిన చెల్లింపులు కట్టని కారణంగా వారి సిబిల్ స్కోరు తగ్గుతుంది. దీంతో వారికి రుణం మంజూరయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. ఎలాంటి కొర్రీలు పెట్టకుండా అర్హులైన వారికి రుణం అందేలా ప్రభుత్వం చూడాలి.

– ఎండీ జలీల్, కొండాపూర్ (సంగారెడ్డి జిల్లా)




## విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

- వృత్తాంతర శిక్షణ కార్యక్రమంలో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 13: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తాంతర శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బోధన విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ నమోదు పెంచే ప్రయత్నం చేయాలని సూచించారు. ఆంగ్ల శిక్షణ కార్యక్రమంలో క్రమంగా అన్ని తరగతులు తీసుకొని పిల్లందరికీ ఆంగ్లంలో రాయడం, చదవడం నేర్పించాలని సూచించారు. అనంతరం సాంఘిక శాస్త్రం శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సందర్శించి ఐదు రోజుల శిక్షణ కార్యక్రమ ప్రణాళికను, కోర్సు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమంలో సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ వృత్తాంతర శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో జరుగుతున్న మౌళిక, భాషా, గణిత సామర్థ్యం అభివృద్ధి, ప్రాథమిక పాఠశాలల ఎమ్మార్పీలకు స్థానిక పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఈవో వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ శిక్షణలో మొత్తం 126 మంది ఎస్జీటీ, ఆర్పీలకు, ఎస్‌ఏలకు, 62 మంది ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఆర్పీలకు, సంగారెడ్డిలోని బాలికల ఉన్నత పాఠశాలలో 201 మంది సోషల్, ఆంగ్లం ఉపాధ్యాయులకు, ఆర్నాల్డ్స్ పాఠశాలలో 126 మంది గణితం ఎస్‌ఏలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 28 మంది డీఆర్పీలు, ఏఎంవో బాలయ్య, సీఎంవో వెంకటేశం, కోర్సు డైరెక్టర్లు విద్యాసాగర్, భాస్కర్, రోజారాణి పాల్గొన్నారు.

## దివ్యాంగ మహిళ దారుణ హత్య

- మహిళ తలపై రాయితో మోది హత్య చేసిన దుండగులు
- రామాయంపేట మండలం తొనిగండ్ల శివారులో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

రామాయంపేట/ రామాయంపేట రూరల్, మే 13 : మెదక్ జిల్లా రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామ శివారులో దివ్యాంగ మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 40 ఏండ్లలోపు వయస్సు దివ్యాంగ మహిళను బండరాయితో తలపై మోది చంపేసి కారులో మృతదేహాన్ని తెచ్చి తొనిగండ్ల గ్రామ శివారులో పడేశారు. రామాయంపేట సీఐ వెంకటరాజ గౌడ్, ఎస్సై బాలరాజు తమ సిబ్బందితో మంగళవారం ఉదయం ఘటనాస్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్కాడ్‌ను ఘటనా స్థలికి తెప్పించి విచారణ చేపట్టారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది.మృతదేహాన్ని పంచనామా నిర్వహించిన పోలీసులు, రామాయంపేట ప్రభుత్వ దవాఖాన మార్చురీలో భద్రపరిచారు. మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. నిందితులను పట్టుకుంటామని విలేకరులతో తెలిపారు. రామాయంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.